క్లుప్తంగా

జెడ్పీ చైర్మన్ పరామర్శ



మధుసూదనరావును పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

తెర్లాం: గుండెపోటు కారణంగా విజయనగరంలోని తిరుమల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని విజయరాంపురం సర్పంచ్ బూరి మధుసూదనరావును జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పరామర్శించారు. ఆదివారం రాత్రి ఆస్పత్రికి వెళ్లిన ఆయన సర్పంచ్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జెడ్పీ చైర్మన్ వెంట మండల వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, మండల వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు శేషగిరి తదితరులు ఉన్నారు.

మండల సర్వసభ్య సమావేశం



ఎంపీపీ గౌరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం

బాడంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, అభివృద్ధి పనులు, వాటి ప్రణాళికలపై చర్చ, 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, బీపీడీపీ నిధులు, పనుల ప్రతిపాదనలు, అభివృద్ధి ప్రణాళికలకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీడీవో ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆసరా సభ



సభాస్థలిని పరిశీలిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు

సంతకవిటి: మండల కేంద్రంలో మంగళవారం జరిగే వైఎస్సార్ ఆసరా సభను విజయవంతం చేయాలని జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు కోరారు. సోమవారం సభా ప్రాంగణాన్ని పరిశీలించిన ఆయన ఈ సభకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ హాజరవుతారన్నారు. లబ్ధిదారులంతా హాజరై, సభకు జయప్రదం చేయాలని కోరారు.

ఆరోగ్య తనిఖీలు



మందులు అందుకున్న రోగులతో వైద్యాధికారి సునీల్‌కుమార్

రేగిడి: మండలంలోని ఖండ్యాం గ్రామంలో సోమవారం నిర్వహించిన ఆయుర్వేద వైద్యశిబిరానికి వచ్చిన రోగులకు వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతర ఆయుర్వేద వైద్యం, మందుల పనితీరు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కింజరాపు సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



వాహన తనిఖీలు చేస్తున్న రూరల్ సీఐ శ్రీనివాసరావు

రాజాం సిటీ: వాహనదారులంతా ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు సూచించారు. సోమవారం స్థానిక పాలకొండ రోడ్డులోని డొంకలమిల్లు వద్ద వాహన తనిఖీలు చేపటిన ఆయన అటువైపుగా వస్తున్న వాహనాలను ఆపి, సంబంధిత ధ్రువపత్రాలను పరిశీలించారు. ఎటువంటి పత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీటుబెల్టు పెట్టుకోవాలని, పెండింగ్ చలానాలు చెల్లించాలని తెలిపారు.

సన్మానం

బొబ్బిలి: స్థానిక బ్రహ్మకుమారీస్ ఆధ్యాత్మిక కేంద్రంలో ఇటీవల కడపకు బదిలీ అయిన డీఎస్పీ శ్రీధర్‌ను బ్రహ్మకుమారీస్ బొబ్బిలి కేంద్రం ఇన్‌చార్జ్ బీకే రాజేశ్వరి ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. అనంతరం డీఎస్పీ సేవలను ప్రశంసించారు. డీఎస్పీ కూడా ఆయనను సన్మానించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

మారిన కళాశాల రూపురేఖలు

విద్యావ్యవస్థ బలోపేతానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోంది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మనబడి నాడు–నేడు కార్యక్రమం పేరిట నిధులు మంజూరు చేసి, పాఠశాలు, కళాశాలల రూపురేఖలను మారుస్తోంది. ఈ క్రమంలో బాడంగి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడంతో పాటు విద్యార్థులకు కావాల్సిన అన్ని మౌలిక వసతులు కల్పించారు. గతంలో కన్నా ఇప్పుడు కళాశాల చాలా బాగుందని, నాణ్యమైన విద్య కూడా అందుతోందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. – బాడంగి



సరికొత్తగా బాడంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల



కళాశాల గేటు నుంచి వేసిన సీసీ రోడ్డు



ప్రహరీ గోడపై విజ్ఞానం పంచే విషయాలు, మ్యాప్‌లు, చిత్రాలు గీయిస్తున్న దృశ్యం



సిద్ధమవుతున్న టాయిలెట్లు



తాగునీటి కోసం కళాశాలలో ఏర్పాటు చేసిన ఆర్‌వో వాటర్ ప్లాంట్

బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలుకుతున్న రెవెన్యూ సిబ్బంది

బొబ్బిలి: మండల తహసీల్దార్‌గా ఎస్.కిరణ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితాలో ఏవైనా తప్పులుంటే తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించి, సరిచేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు బి.గౌరీశంకర్, ఆర్.సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి



రామభద్రపురం: సోంపురం సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ఆరాతీస్తున్న తహసీల్దార్ సులోచనరాణి



తెర్లాం సచివాలయంలో ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు

రామభద్రపురం: జగనన్న కాలనీల్లో ప్రభుత్వం పేదలకు కేటాయించిన ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయాలని తహసీల్దార్ ఎ.సులోచన రాణి సూచించారు. మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో చేపడుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 723 ఇళ్లస్థలాలకు గాను ఇప్పటివరకు 302 ఇళ్లస్థలాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు సమన్వయంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఇంటి స్థలంపై సర్వహక్కులు లబ్ధిదారుకు ఉంటాయన్న విషయం తెలియజేయాలన్నారు.

తెర్లాం: మండలంలోని 21 గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న కాలనీ ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చాలా చురుగ్గా జరుగుతోంది. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు సంయుక్తంగా లబ్ధిదారుల ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ చేపడుతున్నారు. ఒక్క రూపాయి ఖర్చు కూడా లేకుండా ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేస్తుండడంపై లబ్ధిదారులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రాజాం సిటీ: సత్యనారాయణపురం సచివాలయంలో రిజిస్ట్రేషన్లకు వచ్చిన లబ్ధిదారులు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని జగనన్న కాలనీ లబ్ధిదారుల ఇళ్ల రిజిస్ట్రేషన్లు చురుగ్గా జరుగుతున్నాయని మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు అన్నారు. సోమవారం స్థానిక సత్యనారాయణపురం గ్రామ సచివాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించిన ఆయన రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు.

వృత్తివిద్యపై అవగాహన

బాడంగి: క్షేత్ర పర్యటనలో భాగంగా బొబ్బిలిలోని ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలను సందర్శించిన మండలంలోని కేజీబీవీ(కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం) విద్యార్థులకు అక్కడి సిబ్బంది వృత్తివిద్య, వివిధ వృత్తివిద్యా కోర్సులపై సోమవారం అవగాహన కల్పించారు. భవిష్యత్‌లో విద్యార్థులు ఏ రంగంలో బాగా రాణించగలరో ఆ రంగాన్ని ఎంచుకునేందుకు ఈ పర్యటనలో నేర్చుకున్న అంశాలు దోహదపడతాయని ప్రిన్సిపాల్ జి.హరిత తెలిపారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీవో కనకదుర్గ

రేగిడి: కిశోరి బాలికలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాజాం ఐసీడీఎస్ పీవో కనకదుర్గ సూచించారు. మండలంలోని ఉంగరాడ ప్రాథమికోన్నత పాఠశాలకు సోమవారం వెళ్లిన ఆమె కౌమార విద్యలో భాగంగా యుక్తవయసుకు వచ్చిన బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఒత్తిడికి గురికాకూడదని, ప్రశాంతంగా ఉండాలని, ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.శైలజ, రాణిరత్నం, భాను, జయలక్ష్మి, ముత్యాలరత్నం, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన కౌన్సిలర్లు



మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మితో కౌన్సిలర్లు

బొబ్బిలి: స్థానిక పట్టణంలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్‌లను వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు సోమవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. వార్డుల్లో చేపట్టాల్సిన పనులపై వారితో వేర్వేరుగా చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ తెంటు పార్వతి పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష కేంద్రం పరిశీలన

బాడంగి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల కేంద్రాన్ని ఎంఈవో రాజేశ్వరి సోమవారం పరిశీలించారు. ఈ కేంద్రంలో 400 మంది విద్యార్థులు పరీక్ష రాయనుండగా, అందుకు తగ్గట్టు అనుకూలంగా ఉన్నదీ లేనిదీ చూశారు. అలాగే విద్యార్థులకు అవసరమయ్యే వసతులు కల్పించాలని తెలిపారు.

సేవలతోనే గుర్తింపు

వంగర: ఉద్యోగులకు విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయని ఎంపీటీసీ కనగల పద్మ అన్నారు. స్థానిక పట్టణంలో ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎంపికైన బెవర ఈశ్వరరావును సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను ప్రశంసించారు.

ఫెల్ట్ అధ్యక్షుడిగా అచ్యుత్‌కుమార్

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఫెల్ట్(ఫోరం ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజీ టీచర్స్) అసోసియేషన్ నూతన కార్యవర్గం సోమవారం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా బీవీ అచ్యుత్‌కుమార్, గౌరవాధ్యక్షుడిగా ఎ.దామోదరరావు, ఉపాధ్యక్షుడిగా ఎస్.జయకృష్ణ, కార్యదర్శిగా ఆర్‌వీజే నాయుడు, సహ కార్యదర్శిగా ఆర్.రాజశేఖర్, ట్రెజరర్‌గా పి.శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అభ్యసనాభివృద్ధి కార్యక్రమంపై సమీక్ష



ఉపాధ్యాయ బృందంతో సమీక్షిస్తున్న ఎంఈవో త్రినాథరావు

తెర్లాం: స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 6,7,8 తరగతుల విద్యార్థులకు సంబంధించి, జరుగుతున్న అభ్యసనాభివృద్ధి కార్యక్రమంపై ఎంఈవో త్రినాథరావు సోమవారం సమీక్ష నిర్వహించారు. ఏయే పాఠశాలల్లో కార్యక్రమం అమలవుతుందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి, వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల అభ్యసనా స్థాయిని అంచనా వేశారు. దీనికోసం విద్యార్థులతో పుస్తకాలు చదివించడం, వివిధ సబ్జెక్ట్‌లకు సంబంధించి, ప్రశ్నలు అడగడం వంటివి చేశారు. కార్యక్రమంలో ఎంఈఓతో పాటు ప్రధానోపాధ్యాయులు, తెర్లాం, బాడంగి మండలాల నుంచి ఎంపికైన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



ఆస్పత్రిలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ప్రతాప్‌కుమార్

సంతకవిటి:

శ్రీకాకుళం జిల్లాలోని రాగోలు దగ్గరున్న జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని కాకరాపల్లికి చెందిన వావిలపల్లి అప్పలనాయుడుకు వలంటీర్ ప్రతాప్‌కుమార్ సోమవారం పింఛన్ అందజేశారు. ఆస్పత్రికి వెళ్లి మరీ పింఛన్ అందజేయడంపై లబ్ధిదారు, ఆయన కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

బాడంగి: మండల కేంద్రానికి చెందిన తామాడ నర్సిశెట్టి విశాఖపట్నం దగ్గరున్న పెందుర్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, ఆయన వద్దకు వలంటీర్ ఎస్.చందు సోమవారం వెళ్లి, పింఛన్ అందజేశారు.

లెస్సన్ ప్లాన్ ఆధారంగా బోధించాలి

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి ఉపాధ్యాయుల విద్యాబోధన, విద్యార్థుల విద్యాసామర్థ్యాలు, పాఠశాల రికార్డులు, పరిసరాలు పరిశీలించారు. ఉపాధ్యాయులంతా తప్పనిసరిగా లెస్సన్ ప్లాన్, డైరీ కలిగి ఉండాలని, ప్రతిరోజూ లెస్సన్ ప్లాన్ ఆధారంగా బోధన చేయాలని సూచించారు. వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ఆయన పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆస్పత్రి అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్



ఆస్పత్రిలో సేవలపై ఆరాతీస్తున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

రాజాం: ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధిలో అందరూ(వైద్యులు, సిబ్బంది) భాగస్వాములు కావాలని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని సోమవారం సందర్శించిన ఆయన వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న వసతులు, మందుల నిల్వలు, పరికరాలు, మెషీన్ల పనితీరు, నూతన భవన నిర్మాణాలపై ఆస్పత్రి సూపరింటెండెంట్ కరణం హరిని ఆరాతీశారు. ఓపీ సేవలు పెరగాలని, ఆస్పత్రి అభివృద్ధికి అందరూ సహకరించాలని, రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి, పలువురు న్యాయవాదులను కలిసి, ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును వివరించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపుతో పాటు తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, పార్టీ నేతలు నల్లా శ్రీనివాసరావు, తోట తిరుమలరావు, శాసపు వేణుగోపాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తెర్లాంలో ఎల్‌ఐపీ బృందం



విద్యార్థిని అభ్యసన సామర్థ్యం పరిశీలిస్తున్న ఎల్‌ఐపీ బృందం

తెర్లాం: మండలంలోని కూనాయవలస ప్రాథమికోన్నత పాఠశాల, తెర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఎల్‌ఐపీ(లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం) బృందం సోమవారం సందర్శించింది. ఉపాధ్యాయుల బోధన తీరు, విద్యార్థుల విద్యాసామర్థ్యాలు, పాఠశాలల రికార్డులను బృంద సభ్యులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. ముఖ్యంగా విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నారు.. ఎలా రాస్తున్నారు.. విద్యార్థుల చేతిరాత ఏ విధంగా ఉందోనన్న విషయాలు గమనించారు. పలువురు విద్యార్థులతో పాఠ్యాంశాలు చదివించి, వారి అభ్యసన సామర్థ్యాలు అంచనా వేశారు. అలాగే ఉపాధ్యాయుల లెస్సన్ ప్లాన్‌లు, డైరీలు తనిఖీ చేశారు. ప్రతిరోజూ లెస్సన్ ప్లాన్ ప్రకారం పాఠ్యాంశాలు బోధించాలని, చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో త్రినాధరావు, తెర్లాం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామర్థ్యాల పరిశీలన



విద్యార్థుల విద్యాసామర్థ్యం పరిశీలిస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ అధికారులు

రేగిడి: మండలంలోని దేవుదళ గ్రామంలో ఉన్న కేజీబీవీ(కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం)ని సమగ్ర శిక్షా అభియాన్ అధికారులు సోమవారం సందర్శించారు. లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా వారు వివిధ ప్రశ్నల ద్వారా అక్కడి విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలని, మెరుగైన విద్యనందించాలని సిబ్బందికి సూచించారు. లెస్సన్ ప్లాన్ ఆధారంగా పాఠ్యాంశాల బోధన జరగాలని, ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పోగ్రాం అధికారులు జి.రవి, త్రిమూర్తినాయుడు, ఎస్.హుస్సేన్, ఎస్.తిరుపతిరావు, ఎస్.దొరబాబు, ప్రిన్సిపాల్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వంగర: మండలంలోని మద్దువలసలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సాన పద్మజ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు అర్హులైన వారంతా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

ఎస్సీ కేటగిరిలో 70, ఎస్టీ కేటగిరిలో 05, బీసీ కేటగిరిలో 04, ఓసీ కేటగిరిలో 01 చొప్పున సీట్లు ఉంటాయన్నారు. ఐదో తరగతికి సంబంధించి, 3, 4 తరగతులు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివి, రూ.1 లక్ష వార్షిక ఆదాయం మించని, జిల్లాకు చెందిన వారు అర్హులన్నారు. ఇంటర్మీడియట్‌కు సంబంధించి, ఎంపీసీలో 40 సీట్లు, బైపీసీలో 40 సీట్లు ఉంటాయని ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ నాటికి 17 సంవత్సరాలు దాటని విద్యార్థులంతా అర్హులన్నారు. ఈ నెల 23వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

దరఖాస్తుదారుల అర్హతల పరిశీలన



రేగిడిలో వైఎస్సార్ కల్యాణమస్తు దరఖాస్తు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్యామలాకుమారి

రేగిడి: మండలంలోని ఉంగరాడ, దేవుదళ, సోమరాజుపేట గ్రామాల్లో వైఎస్సార్ కల్యాణమస్తు పథకానికి దరఖాస్తు చేసుకున్న వారి అర్హతలను ఎంపీడీవో జి.ఎల్.ఆర్.వి.శ్యామలాకుమారి సోమవారం పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి, దరఖాస్తులు, దరఖాస్తులో పొందుపరిచిన లబ్ధిదారు వివరాలను నిశితంగా పరిశీలించారు. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం పథకాలు అందిస్తోందని, అర్హులైతే తప్పనిసరిగా పథకం లబ్ధి వస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్మోహనరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి నర్సింగరావు, సర్పంచ్‌లు వియ్యపు చక్రపాణి, పేడ్డ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు కల్పించండి



పెరుమాళిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాథరావు

తెర్లాం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు హెచ్‌ఎంలంతా చర్యలు చేపట్టాలని ఎంఈవో జాన త్రినాథరావు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సోమవారం తనిఖీ చేసిన ఆయన ఏయే వసతులు కల్పించాలో తెలిపారు. మండలంలోని 62 పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, ర్యాంప్‌లు, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, తలుపులు, కిటికీలు ఉండేలా చూడాలని, ఒకవేళ వీటిలో ఏవైనా లేకపోతే పాఠశాల మెయింటెనెన్స్ నిధుల నుంచి ఏర్పాటు చేయాలన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టిసారించాలి

రాజాం సిటీ: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై దృష్టిసారించాలని ఎంపీడీవో బాసూరి శంకరరావు సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశమైన ఆయన ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్ పనుల త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. అంతకుముందు నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పలువురు వివిధ సమస్యల పరిష్కారానికి సమర్పించిన వినతులను ఆయన స్వీకరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.